## క్లుప్తంగా

### 12న సర్వసభ్య సమావేశం

**జైనథ్:** ఈనెల 12న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రవీంద్రనాథ్ తెలిపారు. వివిధ శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలను కార్యాలయంలో వెంటనే సమర్పించాలని ఆదేశించారు. సమావేశానికి ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### పరామర్శ

**సిరికొండ:** ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సిరికొండ గ్రామానికి చెందిన జవాను సూర్యవంశీ రాజేశ్వర్ కుటుంబాన్ని శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆత్రం సుగుణ, బోథ్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌లు పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షులు షేక్ ఇమామ్, లక్ష్మణ్, దత్తు, రాజేశ్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ కళాశాలలోనే ఉత్తమ బోధన

**తాంసి:** ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తున్నామని తాంసి కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులతో కలిసి విద్యార్థుల ప్రవేశాల కోసం గ్రామాల బాట పట్టారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి తాంసి ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. వారి వెంట అధ్యాపకులు తిరుపతి రెడ్డి, అశోక్, మల్లేష్, ప్రవీణ్ కుమార్, సంతోష్, దేవేందర్ పాల్గొన్నారు.

### నాణ్యమైన విత్తనాలు అందించాలి

**నేరడిగొండ:** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని మండల వ్యవసాయాధికారి బిర్రు భాస్కర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు వడూర్‌లో ఫర్టిలైజర్, సీడ్స్ అండ్ ఫెస్టిసైడ్ దుకాణాలను తనిఖీ చేశారు. రైతులు కొనుగోలు చేసేటప్పుడు డీలర్లు అందజేస్తున్న బిల్లులను పరిశీలించారు. ఆయా ఫర్టిలైజర్ దుకాణాల్లో విత్తనాలు, ఎరువుల నిల్వలను పట్టికలో ఉంచాలని సూచించారు. రైతులకు అధిక ధరలకు విక్రయాలు జరిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట ఏఈవోలు ఉన్నారు.

### గాలివాన బీభత్సం



ఎగిరిపోయిన రేకులు

**నార్నూర్:** గాదిగూడ మండలంలోని గౌరీ గ్రామంలో గాలివాన బీభత్సం సృష్టించింది. భారీ చెట్లు విరిగిపడడంతో ఇంటిపై కప్పులు ఎగిరిపోయాయి. దీంతో గ్రామస్తులు భయం భయంగా గడుపుతున్నారు. భారీ వర్షానికి ఇంట్లో ఉన్న ఆహార ధాన్యాలు, బట్టలు, ఎలక్ట్రానిక్ వస్తువులు పూర్తిగా తడిసిపోయాయి. ఎరువులు, విత్తనాలు తడిసిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు మేనేజర్

**బేల:** ప్రతిఒక్కరూ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ ప్రభుదాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో వినియోగదారులకు బ్యాంకు సేవలపై బ్యాంకుమేళా నిర్వహించారు. వ్యవసాయం, వ్యక్తిగత, గృహ, బంగారం, ఉపాధి కోసం రుణాలపై అవగాహన కల్పించారు. ఆర్థిక పొదుపు పాటించాలన్నారు. డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ మోసాల గురించి వివరించారు. కార్యక్రమంలో బేల, చప్రాల, సిర్సన్న, జైనథ్, బ్యాంకు మేనేజర్‌లు గోపి, తరుణ్, అనిత్ రహమన్, ఫీల్డ్ ఆఫీసర్లు, క్యాషియర్లు పాల్గొన్నారు.

### ప్రతీ విద్యార్థికి ఉచిత పాఠ్యపుస్తకాలు

**ఇంద్రవెల్లి:** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతీ విద్యార్థికి ఉచితంగా పాఠ్య పుస్తకాలు ప్రభుత్వం పంపిణీ చేస్తుందని ఎంఈవో నారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల విద్యాధికారి కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హత గల ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో ఉంటారని, అంకిత భావంతో పని చేస్తారన్నారు. మెరుగైన సౌకర్యలతో ఉచితంగా అందిస్తున్న విద్యను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న బడిబాట



ఇచ్చోడ: ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

**ఇచ్చోడ:** ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ముఖరా(బి) పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బడిబాట సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాతో పాటు, ఉచితంగా పుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడవ్‌మారుతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

**నేరడిగొండ:** బడీడు పిల్లల్ని బడిలో చేర్పించాలని ఎంఈవో భూమారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో వివిధ గ్రామాలకు చెందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలు పంపిణీ చేశారు. చిన్నారులు బడికి వచ్చి చదివేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

**తాంసి:** ఐదు సంవత్సరాలు దాటిని చిన్నారులను తప్పనిసరి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఈవో శ్రీకాంత్ కోరారు. బడిబాటలో భాగంగా శుక్రవారం కప్పర్ల గ్రామంలో ఉపాధ్యాయులతో కలిసి ప్రచారం చేశారు. ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాలని తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. వారివెంట పాఠశాల హెచ్ఎం రాజన్న, ఉపాధ్యాయులు జయవర్ధన్ రెడ్డి, నవ్య, కుసుమ, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

**నార్నూర్:** బడిలో చేరి తమ బంగారు భవితను మార్చుకోవాలని తహసీల్దార్ జాడి రాజలింగు, ఎంపీడీవో జవహర్, ఎంఈవో రాపల్లి ఆశన్నలు అన్నారు. శుక్రవారం మండలంలోని తడిహత్నూర్‌లో నిర్వహించిన బడిబాటలో పాల్గొన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రతి విద్యార్థిని పాఠశాలకు పంపించేలా అవగాహన కల్పించారు. బడి బయట పిల్లలను బాల కార్మికులను అనాథలను బడిలో చేర్పించడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటే ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు పాఠశాల యూనిఫాం, తెలుగు ఇంగ్లీషులో విద్యాబోధన, నాణ్యమైన మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రహ్లాద్, సిబ్బంది పాల్గొన్నారు.



తాంసి: పాఠశాలలో చేరుతున్న చిన్నారులు



నేరడిగొండ: పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో



నార్నూర్: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

# బెడ్ పద్ధతిలో పంటల సాగు

**తాంసి:** మండల వ్యాప్తంగా ఈఏడాది వానాకాలం సాగులో రైతులు పత్తి పంటను బెడ్ పద్ధతిలో సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. బెడ్ పద్ధతిలో పత్తి సాగు కోసం ఇప్పటి నుంచే గట్లను సిద్ధం చేస్తున్నారు. వర్షాలు సైతం ఆడపదడపా కురియడంతో పత్తి విత్తనాలు విత్తేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. బెడ్ పద్ధతిలో పంట సాగుచేయడం వలన అధిక వర్షాలు కురిసిన సమయంలో పంట దెబ్బతినకుండా ఉంటుంది. కలుపుతీత తీత అవసరం ఉండదు. సులువుగా పంట సాగు చేసే అవకాశం ఉండడంతో బెడ్ పద్ధతికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పంటచేలలో జామిడి, తాంసి, కప్పర్ల, పొన్నారి, వడ్డాడి, హస్నాపూర్, సావర్గాం, గోట్కూరి గ్రామాల్లో రైతులు ట్రాక్టర్‌లతో పంటచేల్లో బెడ్‌లను ఏర్పాటు చేసుకుంటున్నారు.



ట్రాక్టర్‌తో బెడ్‌లను ఏర్పాటు చేస్తున్న రైతు

# కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ఉట్నూర్‌రూరల్:** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు కోరారు. శుక్రవారం ఎంఈవో కార్యాయంలో ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ సమావేశం నిర్వహించారు. గత 20 సంవత్సరాల నుంచి కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఒక్క విద్యార్థికి మెస్ చార్జీలు ఒక రోజుకు 15 రూపాయలు చార్జీలు పెంచాలని, ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ సరఫరా చేయాలని, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలన్నారు. కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి కార్మికుల ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. సమావేశంలో లక్ష్మిబడాయి, గిరిజాబాయి, కవిత, సిర్జా, ముత్తుబాయి, మీరాబాయి, దుబ్బాబాయి, భూమవ్వ, ఉంగుబాయి, చందు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కుంటాల రాములు

# 'రైతులను ఇబ్బంది పెట్టవద్దు'



అధికారులతో మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

**ఇచ్చోడ:** పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతులను అటవీ అధికారులు ఇబ్బంది పెట్టవద్దని ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకులు ఆత్రం సుగుణ అన్నారు. శుక్రవారం మండలంలోని బావోజిపెట్, సిరిచెల్మ గ్రామాల్లో పోడు భూములు సాగు చేస్తున్న రైతుల పొలాలను సందర్శించారు. గత కొన్నేళ్లుగా పోడు భూములు సాగు చేస్తూ.. జీవనం సాగిస్తున్నారని, అటవీ అధికారులు తరుచూ తమను వేధిస్తున్నట్లు వాపోయారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి పోడు భూములు సాగు చేస్తున్న వారి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పోడు భూముల చుట్టూ తవ్వుతున్న కందకాల పనులను నిలిపివేయాలన్నారు. వారి వెంట బోథ్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్, ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్, అజీం, తదితరులు పాల్గొన్నారు.

### వీవీ సేవలు పునరుద్ధరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**ఎదులాపురం:** గతంలో పనిచేసిన విద్యావలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీతకు జిల్లా విద్యా వలంటీర్ సంఘం నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్నందున విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని తమను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగ్, మల్లయ్య, రాంకిషన్, బాలకిషన్, గజానన్, చరణ్ సింగ్, లక్ష్మి పాల్గొన్నారు.

### నీట్‌లో ప్రతిభ



ప్రసూన్ రెడ్డి

**తాంసి:** ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో తాంసి గ్రామానికి చెందిన వడ్డి ప్రసూన్ రెడ్డి ప్రతిభ కనబరిచాడు. నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి 630 మార్కులు సాధించాడు. తండ్రి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తుండగా ప్రసూన్ స్థానిక జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాడు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. నీట్ పరీక్షకు సన్నద్ధమై ప్రతిభ కనబరిచాడు. ప్రసూన్‌ను గ్రామస్తులు, బంధువులు అభినందించారు.

### ఒకే రకం విత్తనాలు విత్తుకోవద్దు

**ఇచ్చోడ:** రైతులు ఒకే రకం పత్తి విత్తనాలు విత్తుకోవద్దని ఏఈవో అనుదీప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దూబార్‌పేట్‌లో రైతులతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. ఒక్క రైతు కనీసం మూడు నుంచి నాలుగు రకాల పత్తి విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. పూర్తి స్థాయిలో వర్షాలు పడిన తరువాతే విత్తనాలు విత్తుకోవాలన్నారు. కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. రైతులను మోసం చేయాలని చూస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

# రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోం

● బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

**ఇచ్చోడ:** పేద రైతులకు ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకోమని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని సిరిచెల్మ అటవీ ప్రాంతంలో పోడు వ్యవసాయం చేస్తున్న భూములను పరిశీలించి అటవీ అధికారులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అటవీశాఖ అధికారులు రైతులను అడ్డుకోవడం సరికాదన్నారు. అన్నివర్గాల ప్రజలకు అండగా నిలుస్తామన్నారు. ఇలాంటి చర్యలు మళ్లీ పునరావృతం కాకుండా చూడానల్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, గాడ్గే సూభా ష్, పాండురంగ్, నర్వాడే రమేశ్ పాల్గొన్నారు.



అటవీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

### లోక్ అదాలత్ విజయవంతం చేయండి

**బోథ్:** బోథ్ జూనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జడ్జి హుస్సేన్ కోరారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. రాజీకి అవకాశమున్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకోవాలన్నారు. ఇందుకు న్యాయవాదులు చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు వామన్‌రావ్, మోహన్‌రావ్, సుభాష్, పంద్రం శంకర్, హరీష్, విజయ్ కుమార్, అంగద్ కేంద్రే, తదితరులు పాల్గొన్నారు.



న్యాయవాదులతో సమావేశమైన జడ్జి హుస్సేన్

### జోరుగా వ్యవసాయ పనులు



నార్నూర్: దుక్కి దున్నుతున్న రైతులు

**ఇచ్చోడ/నార్నూర్:** తొలకరి జల్లులు పలకరించడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రోహిణి కార్తె ప్రారంభమైంది. గత రెండు రోజుల నుంచి వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఇచ్చోడ, నార్నూర్, గాదిగూడ మండలాల్లో పలువురు రైతులు పత్తి, కంది, పెసర విత్తనాలు విత్తుకున్నారు. అయితే తొందర పడి విత్తనాలు విత్తుకోవద్దని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.



ఇచ్చోడ: విత్తనాలు విత్తుతున్న కూలీలు

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ఎదులాపురం:** మరమ్మతులో భాగంగా శనివారం పట్టణంలోని పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఎస్ఈ జేఆర్ చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. భుక్తాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యానగర్, భుక్తాపూర్, ద్వారకానగర్, సినిమారోడ్, మోచిగల్లీ, భాగ్యనగర్, వడ్డెర కాలనీ, క్రాంతినగర్, హమాలీవాడ, తాటిగూడ, మహాలక్ష్మివాడ, చిల్కూరి లక్ష్మీనగర్, జైజవాన్‌నగర్, గాంధీచౌక్, శివాజీచౌక్, రైల్వేస్టేషన్ ప్రాంతాలు, సీసీఐ సబ్‌స్టేషన్ పరిధిలోని జీఎస్ ఎస్టేట్, తిర్పెల్లి, బద్కా మొహల్లా, బ్రాహ్మణవాడ, పంజేషా ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. రిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీ, సప్తగిరి కాలనీ, కలెక్టర్ చౌక్, ఓల్డ్ హౌజింగ్ బోర్డు, సంజయ్‌నగర్ ప్రాంతాలకు ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని బంగారిగూడ, పిప్పల్‌ధరి, అంకోలి సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

# ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

**ఎదులాపురం:** కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎర్రజి హరీష్, మడావి గణేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో పలు విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పాఠ్య పుస్తకాలు, టై, బెల్ట్, షూ, యూనిఫాంలు అమ్ముతూ, అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విచ్చలవిడిగా ఫీజుల పెంచుతున్నారని ఆరోపించారు. జిల్లాలో ప్రభుత్వ విద్యాభివృద్ధికి కృషి చేయాలని, శిథిలావస్థలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని కోరారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఉట్నూర్‌రూరల్:** అధికారులు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్ రావ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగాడా వివిధ శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఖానాపూర్ నియోజకవర్గంలో తాగునీటి కోసం సుమారు 5 కోట్ల వరకు నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. విద్య, వ్యవసాయ, వైద్య రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. దళారులు రైతులను మోసం చేస్తే సహించేది లేదన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో కరెంటు కోతలు లేకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు అప్రతమత్తంగా ఉండి ప్రజలను మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంపీటీసీలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

### సమన్వయంతో పనిచేయాలి

**ఉట్నూర్‌రూరల్:** అధికారులు సమన్వయంతో పనిచేస్తూ.. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్‌మండలంలోని క్యాంపు కార్యాలయంలో ట్రైబల్ వెల్ఫేర్, పంచాయితీ రాజ్, సోషల్‌వెల్ఫేర్, విద్యుత్‌శాఖ, అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఆయా శాఖల అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కొత్తగా జరిగే అభివృద్ధి పనుల నివేదికలు తమకు ఇవ్వాలని, సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానన్నారు.

# సర్వసభ్య సమావేశం వాయిదా

● ప్రకటించిన ఎంపీపీ ఆడ చంద్రకళ

**నార్నూర్:** గాదిగూడ ఎంపీపీ ఆడ చంద్రకళ రాజు అధ్యక్షతన శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సరైన కోరం లేక వాయిదా పడింది. త్వరలో మరో తేదీని ప్రకటిస్తామని ఎంపీపీ తెలిపారు. అనంతరం అక్కడే వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామీణ ప్రాంతాల్లో శానిటేషన్, క్లోరినేషన్‌పై ప్రత్యేక దష్టి సారించాలని సూచించారు. అమ్మ ఆదర్శ కమిటీ చేపడుతున్న పాఠశాల అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, గాదిగూడ, ఝరి పీహెచ్సీ వైదాధికారులు సంజీవ్, ప్రవీణ్ కుమార్, ఐకేపీ ఏపీఎం మాధవి, ఈజీఎస్ ఏపీవో నితిన్ కుమార్, ఎంఈవో రాపల్లి ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.




వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఎంపీపీ